
# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



## క్రైస్తవ మాసపత్రిక

JUNE - 2008

సంవత్సర చందా రూ. 50/-

# ఏషియన్ బైబిలు లెక్చర్‌షిప్

## Asian Bible Lectureship at Kakinada

**తేదీలు** : 2008 నవంబరు 30వ తేదీ నుండి
డిశంబరు 4వ తేదీ వరకు

**సమయం** : ప్రతిరోజు ఉదయం 10:00 గంటలకు
మధ్యాహ్నం 3:00 గంటలకు
సాయంత్రం 6:00 గంటలకు

**స్థలం** : కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్
విద్యుత్ నగర్
**కాకినాడ**

ఏషియన్ బైబిలు లెక్చర్‌షిప్‌లో ఆసియాలోని పలుదేశాలలో సువార్త చాటుచున్న గొప్ప బోధకులు, స్వదేశీ బోధకులు ఉపన్యసించెదరు, బైబిలులోని ప్రాముఖ్యాంశములను తెలిసికొనుటకు మీకు ఇదే మంచి తరుణము. ఆ సభలో పాల్గొనుటకు మీరు మీ సంఘము ఇప్పటి నుండే సిద్ధపడండి.

**Cell : 92474-56270**
0884-2363722

**వందనములతో**
**రిక్కీ గూటంగారు**
**జాషువా గూటంగారు**

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

**సంపుటి 28** **జూన్ 2008** **సంచిక 11**


## యేసుక్రీస్తు దేవుని కుమారుడు - 3

### (Jesus Christ, the son fo God - 3)

యేసు ప్రభువు దేవుని కుమారుడు, దేవుడు అను అంశమును గత రెండు పాఠములలో కొంతమట్టుకు తెలిసికొని యున్నాము. "యూదుల అధికారియైన నీకొదేమను పరిసయ్యుడొకడుండెను. అతడు రాత్రియందు ఆయనయొద్దకు వచ్చి - బోధకుడా నీవు దేవుని యొద్ద నుండి వచ్చిన బోధకుడవని మేమెరుగుదుము, దేవుడతనికి తోడైయుంటేనే గాని నీవు చేయుచున్న సూచక క్రియలను ఎవడును చేయలేడని ఆయనతో చెప్పెను" (యోహాను 3:1-2). యేసు యొక్క శిష్యుడైన 'సీమోను పేతురు - ప్రభువా యెవని యొద్దకు వెళ్లుదుము ? నీవే నిత్య జీవ మాటలు గలవాడవు; నీవే దేవుని పరిశుద్ధుడవని మేము విశ్వసించి యెరిగియున్నామని ఆయనతో చెప్పెను" (యోహాను 6:69).

### పాటిలేని రక్షకుడు

యేసు ప్రభువు ఒకప్పుడు సమరయ మార్గమున వెళ్లవలసి వచ్చెను. ఆయన సుఖారను ఒక ఊరికి వచ్చి ప్రయాణము

వలన అలసియున్న రీతిగనే అక్కడ యాకోబు బావి యొద్ద కూర్చుండెను. సమరయ స్త్రీ ఒకతె నీళ్లు చేదుకొనుటకు అక్కడికి రాగా ఆయన ఆమెతో ఆత్మీయ సంగతులను గూర్చి సంభాషించెను. ఆయన ఆమె జీవిత చరిత్రనంతటిని ఎరిగియుండెను. దేవుని గూర్చి సత్యారాధనను గూర్చి ఆయన ఆమెకు వివరించెను. ఆ స్త్రీ తనకుండ విడిచిపెట్టి ఊరిలోనికి వెళ్లి మీరు వచ్చి నేను చేసినవన్నియు నాతో చెప్పిన మనుష్యుని చూడుడి; ఈయన క్రీస్తు కాడా అని ఆ ఊరివారితో చెప్పగా వారు ఆ ఊరిలో నుండి బయలుదేరి ఆయన యొద్దకు వచ్చి, తమ యొద్ద ఉండుమని ఆయనను వేడుకొనిరి. గనుక ఆయన అక్కడ రెండు దినములుండెను. ఆయన మాటలు వినినందున ఇంకను అనేకులు నమ్మి ఆ స్త్రీని చూచి - ఇకమీదట నీవు చెప్పిన మాటను బట్టికాక, మా మట్టుకు మేము విని, యీయన నిజముగా లోకరక్షకుడని తెలిసికొని నమ్ముచున్నామనిరి (యోహాను 4:1-42).

మత్తయి సువార్త 5, 6, 7 అధ్యాయాల్లో యేసు ప్రభువు కొండమీద చేసిన ప్రసంగ సారాంశమున్నది. బహుజన సమూహములు ఆయన చెప్పుచున్న అనేక ఆత్మీయ సంగతులను నిద్రాహారములు మాని వినిరి. యేసు ఆ ప్రసంగములోని "మాటలను చెప్పి ముగించి నప్పుడు జన సమూహములు ఆయన బోధకు ఆశ్చర్యపడుచుండిరి. ఏలయనగా ఆయన వారి శాస్త్రులవలె గాక అధికారము గల వానివలె వారికి బోధించెను" (మత్తయి 7:28-29).

ఒకప్పుడు యూదుల ప్రధాన యాజకులును పరిసయ్యులును యేసును పట్టుకొనవలెనని బంట్రౌతులను పంపిరి. గాని వారాయనను పట్టుకొనకుండ తిరిగివెళ్లిరి. "ఆ బంట్రౌతులు ప్రధాన యాజకుల యొద్దకును పరిసయ్యుల యొద్దకును వచ్చినప్పుడు వారు ఎందుకు మీరాయనను తీసికొనిరాలేదని అడుగగా ఆ బంట్రౌతులు, ఆ మనుష్యుడు మాట లాడినట్లు ఎవడును ఎన్నడును మాట లాడలేదనిరి" (యోహాను 7:45-46).

ఇప్పటివరకు యేసు యొక్క బోధలను విన్నవారిలో 5గురి ప్రతిస్పందనను మనము గమనించాము. పరిసయ్యుడగు నీకొదేము "నీవు దేవుని యొద్ద నుండి వచ్చిన బోధకుడవని మేమెరుగుదుము" మన్నాడు. సమరయ స్త్రీ "ఈయన క్రీస్తు కాడా?" యని ప్రశ్నించింది. సమరయ పట్టణస్థులు సయితము తమ మట్టుకు తాము విని "నిజముగా ఈయన లోకరక్షకుడని" తెలిసికొనుచున్నామనిరి. యేసు యొక్క గొప్ప ప్రసంగమును వినిన జనసమూహములు అధికారయుక్తమైన

ఆయన బోధకు ఆశ్చర్యపడిరి. చివరకు ఆయనను బంధించుటకు వెళ్లిన బంట్రౌతులు సయితము ఆయన బోధచే బంధింపబడి, వట్టి చేతులతో తిరిగి వెళ్లి "ఆ మనుష్యుడు మాటలాడినట్లు ఎవడును ఎన్నడును మాటలాడలేదని" సాక్ష్యమిచ్చిరి. దీనంతటి సారాంశమేమిటి? యేసు చేసిన బోధలే ఆయన దేవుడని దైవసమానుడని, దేవుని కుమారుడని సాక్ష్యమిచ్చుచున్నవి.

**అసామాన్యమైన బోధకుడు**

యేసు ప్రభువు చేసిన బోధలెట్లున్నవి? మునుపెన్నడు ఏ మానవుడు చెప్పని సంగతులను ఆయన బోధించెను. విద్యావంతులు, విద్యాహీనులు, ధనికులు, ధనహీనులు, సామాన్యులు సయితము అర్థము చేసికొనే రీతిగ ఆయన బోధించెను. మానవుని ఆంతర్యము నెరగినవాని వలె ఆయన బోధించెను. ఆయన దేవుని కుమారుడు గనుక మానవుని గూర్చిన సమస్తమును ఎరిగియుండెను. "యేసు అందరిని ఎరిగినవాడు... ఆయన మనుష్యుని ఆంతర్యమును ఎరిగినవాడు గనుక ఎవడును మనుష్యుని గూర్చి ఆయనకు సాక్ష్యమియ్యనక్కరలేదు" (యోహాను 2:24-25).

యేసు ప్రభువు జన సమూహముల నుద్దేశించి కొండ మీదనుండి చేసిన ప్రసంగము రెండువేల సంవత్సరముల పాతదైనను, నేటికిని క్రొత్తగనే యున్నది. అది ఆయన రాజ్యమైన సంఘము యొక్క రాజ్యాంగము. ఆయన బోధను ఇప్పుడు విందాము; "ఆత్మ విషయమై దీనులైన వారు ధన్యులు; పరలోక రాజ్యము వారిది. దుఃఖపడువారు ధన్యులు; వారు ఓదార్చబడుదురు. సాత్వికులు ధన్యులు; వారు భూలోకమును స్వతంత్రించుకొందురు; నీతి కొరకు ఆకలి దప్పులు గలవారు ధన్యులు; వారు తృప్తిపరచబడుదురు. కనికరము గలవారు ధన్యులు; వారు కనికరము పొందుదురు. హృదయశుద్ధి గలవారు ధన్యులు; వారు దేవుని చూచెదరు. సమాధానపరచువారు దన్యులు వారు దేవుని కుమారులనబడుదురు. నీతి నిమిత్తము హింసింపబడువారు ధన్యులు, పరలోక రాజ్యము వారిది...

"మీరు లోకమునకు ఉప్పయి యున్నారు. ఉప్పు నిస్సారమైతే అది దేనివలన సారము పొందును ? అది బయట పారవేయబడి మనుష్యుల చేత త్రొక్కబడుటకే గాని మరి దేనికిని పనికిరాదు. మీరు లోకమునకు వెలుగై యున్నారు; కొండమీద నుండు పట్టణము మరుగై యుండనేరదు. మనుష్యులు దీపము వెలిగించి కుంచము క్రింద పెట్టరు కాని అది యింట నుండు వారందరికీ వెలిగిచ్చుటకై దీప స్థంభము

మీదనే పెట్టుదురు. మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి" (మత్తయి 5:1-16).

యేసు ప్రభువు చేసినట్టి గొప్పనైతిక ఆధ్యాత్మిక బోధలను మునుపెన్నడు ఎవరు చేసియుండలేదు. "నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమించుము, మీ పరలోకమందున్న మీ తండ్రికి కుమారులై యుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి. మిమ్మును హింసించు వారి కొరకు ప్రార్థన చేయుడి" యని ఆయన బోధించెను (మత్తయి 5:43-44). మరియు "మనుష్యులు మీకు ఏమి చేయవలెనని మీరు కోరుదురో ఆలాగుననే మీరును వారికి చేయుడి" యని ఆయన బోధించెను (మత్తయి 7:12). యేసు ప్రభువు బోధలను ప్రతివారు పాటిస్తే ఈ లోకంలో సమస్యలు యేమీ వుండవు. గృహంలో, సమాజంలో, దేశదేశాల మధ్య శాంతి సమాధానములు నెలకొల్పబడి యుండును.

### అధికారము గలవాడు

యేసుప్రభువు బోధించినప్పుడు అధికారము గలవానివలె బోధించెను. "ధర్మశాస్త్రమునైనను ప్రవక్తల వచనముల నైనను కొట్టివేయవచ్చితినని తలంచవద్దు; నెరవేర్చుటకే గాని కొట్టివేయుటకు నేను రాలేదు" అని ఆయన బోధించెను (మత్తయి 5:17). ధర్మశాస్త్రమును నెరవేర్చుట ద్వారా దానిని ఆయన ఎత్తివేసెను. దానికంటె శ్రేష్ఠమైన క్రొత్త నిబంధననిచ్చెను. ధర్మశాస్త్రము నరహత్య చేయవద్దని చెప్పింది. "నరహత్య చేయవద్దని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా, నేను మీతో చెప్పునదేమనగా తన సహోదరుని మీద కోపపడు ప్రతివాడు విమర్శకు లోనగును; తన సహోదరుని చూచి వ్యర్థుడా అని చెప్పువాడు మహా సభకు లోనగును; ద్రోహి అని చెప్పువాడు నరకాగ్నికి లోనగును" (మత్తయి 5:21-23). ధర్మశాస్త్ర ప్రకారము ఒకడు హత్య చేస్తేనే అపరాధియగును, గాని క్రీస్తు నియమము ప్రకారము తన సహోదరుని ద్వేషించువాడు, దూషించువాడు అంతే అపరాధియగును, నరకాగ్నికి లోనగును. అట్లే వ్యభిచరించవద్దని ధర్మశాస్త్రం చెప్పింది. అయితే యేసు దాన్ని ప్రక్కనబెట్టి "నేను మీతో చెప్పునదేమనగా - ఒక స్త్రీని మోహపు చూపుతో చూచు ప్రతివాడు అప్పుడే తన హృదయమందు వ్యభిచారము చేసినవాడగునని" ఆయన బోధించెను (మత్తయి 5:27-28). మోషే ధర్మశాస్త్ర ప్రకారము ఒకడు వ్యభిచరిస్తేనే అపరాధిగాని క్రీస్తు నియమము ప్రకారము ఒక స్త్రీని మోహపు చూపుతో

చూస్తేనే అపరాధి. యేది శ్రేష్టమైనది ? నిశ్చయముగా క్రీస్తు యొక్క క్రొత్త నిబంధనే గదా ? దేవుడు తప్ప మరెవడు పాతనిబంధన స్థానంలో క్రొత్త నిబంధన నీయగలరు ? ఆ మొదటి లోపము లేనిదైతే రెండవదానికి అవకాశముండ నేరదు (హెబ్రీ 8:7). "ఆయన క్రొత్త నిబంధన అని చెప్పుట చేత మొదటిది పాతదిగా చేసియున్నాడు. ఏది పాతగిలి ఉడిగిపోవునో అది అదృశ్యమగుటకు సిద్ధముగా ఉన్నది" యని హెబ్రీ పత్రిక లేఖకుడు చెప్పుచున్నాడు (హెబ్రీ 8:13).

**పరలోక సంగతుల నెరిగినవాడు**

యేసుప్రభువు పరలోక సంగతులను స్వయంగా ఎరిగినవాడు గనుక మానవులు వాటిని అర్థము చేసికొనేలాగునసులువుగా వారికి ఉపమానముల రీత్యా బోధించెను. పరలోకమునుండి వచ్చినవాడు గనుక అక్కడి సంగతులను చూచి వచ్చినవాని వలె ఆయన బోధించెను. "మీ హృదయ ములను కలవరపడనియ్యకుడి; దేవుని యందు విశ్వాసముంచుచున్నారు. నాయందును విశ్వాసముంచుడి, నా తండ్రి యింట అనేక నివాసములు కలవు, లేని యెడల మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరచవెళ్లుచున్నాను. నేను వెళ్లి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నా యొద్ద నుండుటకు మిమ్మును తీసికొనిపోవుదునని" ఆయన బోధించెను (యోహాను 14:1-3). పరలోకమును గూర్చి, నిత్యనరకమును గూర్చి ఎరిగియున్నవాడు గనుక ఆయన వాటిని గూర్చి మానవులకుపదేశించెను.

మానవులు పరలోకం చేరుకోవాలంటే, తండ్రియొద్దకు చేరుకోవాలంటే యేసు క్రీస్తు ద్వారానే చేరుకోవాలి. వేరే మార్గము లేనేలేదు. "యేసు నేనే మార్గమును, సత్యమును జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు" అని బోధించెను. చివరకు అంత్యదినమున మనకు తీర్పుతీర్చువాడు కూడా యేసుప్రభువే. "నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపని వానికి తీర్పు తీర్చు వాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్య దినమున వానికి తీర్పు తీర్చును'' అని ఆయన చెప్పెను (యోహాను 12:48).

యేసు ప్రభువు చేసిన బోధలే ఆయన దేవుని కుమారుడని నిరూపించుచున్నవి. ఇప్పుడు మనం ఆయన వాక్యము నంగీకరించి లోబడిన యెడల, మనం పరలోకంలో నిత్యము ప్రభువుతోను, ఆయన దూతలతోను ఉండగలము.

# సంఘ ఆర్థిక సహాయము

## (Support of the Church)

సంఘమునకు ఆర్థిక సహాయము ఎక్కడనుండి వచ్చును ? సంఘము మిగిలిన మతసంస్థలన్నిటికంటె వేరైన సంస్థ గనుక ఇది సరియైన ప్రశ్నయే. మిగిలిన సంస్థలవలె ఆర్థిక సహాయము కొరకు సంఘము మామూలు స్థలము లలో వెదుకరాదు. ఉదాహరణకు సంఘము ప్రభుత్వమునుండి ఆర్థిక సహాయము కొరకు ఎదురుచూడరాదు. డబ్బును పోగుచేసే సభలు అది నడిపించ రాదు. సభ్యులు, సభ్యులు కానివారు కూడా చందాలియ్యవలసినదని అది అట్టి సభలలో ఒత్తిడి చేయరాదు. ప్రత్యేక వస్తువులను అమ్ముటద్వారా గాని, లాటరీ టిక్కెట్లు అమ్ముటద్వారా గాని అది డబ్బును పోగుచేయరాదు. అది ఇతర మత సంస్థలతో సహవాసము కలిగి యుండదు. గనుక సహాయము కొరకు వాటిని అభ్యర్థించలేదు. అట్లయిన సంఘమునకు ఆర్థికముగా సహాయము ఎక్కడనుండి వచ్చును ? ఈ సంగతిని లేఖనములు అతి సులభముగా విపుల ముగా మనకు జవాబిచ్చుట మనము చూడగలము.

క్రీస్తు సంఘము అనేక స్థానిక సంఘ ములతో సమకూడియున్నది. ప్రతి స్థానిక సంఘము పెద్దలను, పరిచారకులను, బోధకులను, ఉపదేశకులను, సభ్యులను కలిగియున్నది. ప్రతి స్థానిక సంఘము తన విధులను, బాధ్యతలను అవసరత లను, పనిని కలిగియున్నది. ప్రతిస్థానిక సంఘము మిగిలిన స్థానిక సంఘముల నుండి స్వతంత్రత కలిగియున్నందున, దేని ఆర్థికావుసరములను అదే తీర్చుకొన వలెను. అంటే క్రీస్తు సంఘమునకు ప్రపంచమందు ఒక ముఖ్య కేంద్రము గాని, ముఖ్యాధికారిగాని, ఆర్గనైజేషన్‌గాని లేదు. అందువలన ఒక స్థానిక సంఘము సహాయముకొరకు ఒక సార్వజనాధికారిని అభ్యర్థించవలసిన పనిలేదు. ఒక స్థానిక సంఘము చిన్నదైయుండి, అవుసరతలో యున్న యెడల, దాని అవుసరములలో సహాయపడు నిమిత్తము మరికొన్ని స్థానిక సంఘములు దానితో సహవాసము కలిగియుండవచ్చును. సంఘములు అట్లు సహాయపడవలెననే నిర్బంధము ఏమియు లేదు. గనుక ప్రతి స్థానిక క్రీస్తు సంఘము అది చిన్నదేమి, పెద్దదేమి తన ఆర్థికావుస రములు తానే తీర్చుకొనవలెను.

ప్రతి స్థానిక సంఘము వ్యక్తిగత

క్రైస్తవులతో సమకూడియున్నది. అయితే ప్రతివారును కానుకల నీయవలసినదని ప్రభువు ఆజ్ఞాపించెను. కొరింథులోయున్న స్థానిక సంఘమునకు పౌలు ఇట్లువ్రాసెను; "పరిశుద్ధుల కొరకైన చందా విషయమైతే నేను గలతీయ సంఘములకు నియమించిన ప్రకారము మీరును చేయండి. నేను వచ్చినప్పుడు చందా పోగు చేయకుండ ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్ధిల్లినకొలది తన యొద్ద కొంత సొమ్ము నిలువచేయవలెను " (1 కొరింది 16:1-2). వారికి మరల అతడు ఇట్లు వ్రాసెను. "సణుగుకొనకయు, బలవంతముగా కాకయు ప్రతివాడును తన హృదయములో నిశ్చయించుకొనిన ప్రకారము ఇయ్యవలెను; దేవుడు ఉత్సాహముగా ఇచ్చువానిని ప్రేమించును" (2 కొరింధి 9:7). సంఘ సభ్యులు చందా నిచ్చుటకును, స్థానిక సంఘమునకు ఆర్థికముగా సహాయ పడుటకు ఈ వచనములలో వారు పాటించవలసిన కొన్ని నియమములను అతడు వ్రాసెను. దయచేసి వాటిని గమనించుము :

1. వారు ప్రతి ఆదివారమున చందానీయవలెను. అది వారు ఆరాధనకు కూడుకొనిన దినము (అపొ.కా. 20:7). అందువలన తమ సొమ్మును తీసుకొని వచ్చుటకు అది చాల అనుకూల దినము.

2. ఇచ్చుటలో ప్రతివారు పాలు పొందవలెను. వారు తమ ధనమునుగాని, దాన్యముగాని లేక మరియేదయినను గాని ఇయ్యవచ్చును. ఇచ్చునది సంఘమునకు ఉపయోగకరముగాను, ఇచ్చువానికి అనుకూలమైనదిగాను ఉన్నదానిని ఇయ్యవచ్చును.

3. క్రైస్తవుడు తాను వర్ధిల్లిన కొలది ఇయ్యవలెను. వారు ఎక్కువ డబ్బును సంపాదించిన యెడల ఎక్కువ చందా నీయవలెను. వారు ఒక వారములో ఏమియు సంపాదించలేని యెడల ఆ వారములో ఇయ్యనవసరములేదు. అయితే వారు సంపాదించిన దానిలో ఎంతభాగము ఇయ్యవలెను ? ఇంతియ్యవలెనని నేను చెప్పజాలను. అది వ్యక్తిగతముగా నిర్ణయించుకొనవలెను. బైబిలు బోధించురీతిగ యిచ్చు ప్రతివారు ఎంత నియ్యవలెనో ఎరిగియే యుందురు. యూదులు తమ ఆదాయములో దశమ భాగమును యిచ్చెడివారు. గాని మనము వారి కంటే శ్రేష్ఠమైన చట్టము క్రింద యున్నాము. వారికంటే శ్రేష్ఠమైన వాగ్దానములను కలిగియున్నాము. గనుక వారి కంటే ఎక్కువ యిచ్చుటకు మనము ప్రోత్సహించబడవలెను.

4. వారు ఇవ్వవలసిన రీతిగా

ఆదివారమున ఇచ్చిన యెడల అవసరము వచ్చుసరికి స్థానిక సంఘములో డబ్బు ఉండును. ఈరీతిగా కానుకలు ఇయ్యని యెడల దేవుని పని జరుగుటకు అభ్యంతరము కలుగును.

5. ప్రతివాడును తన హృదయములో నిశ్చయించుకొనినరీతిగ ఇయ్యవలెను. దీనినిబట్టి ఒకడు ఇచ్చుటకు ముందు ఎంత ఇయ్యవలెనో నిశ్చయించుకొని ఇయ్యవలెను. ఎంత ఇయ్యవలెనో ఆలోచించకుండగ చందా ఎత్తు సమయమున జేబులో చెయ్యిపెట్టి చేతికి దొరికిన నాణెమును ఏదో ఇచ్చిన యెడల అతడు ఇయ్యవలసినంత దేవునికి ఇయ్యకపోవును. లేఖనముల ప్రకారము మనము ఇయ్యవలెనన్న ముందుగనే ఆలోచించుకొని ఇయ్యవలెను.

6. ఒకడు సణుగుకొనకయు, బలవంతముగా కాకయు ఇయ్యవలెను. ఎవరో బలవంతము చేయుట వలన ఒకడు ఇయ్యరాదు గాని అతనికి ఇయ్యవలెనని మనస్సున్నది గనుక మనస్ఫూర్తిగ ఇయ్యవలెను.

7. ఇచ్చు ప్రతి కానుకయు సంతోషముతో ఇయ్యవలెను అతడు దేవునిచే ఆశీర్వదించబడి యున్నందున దేవునికి కానుకల నిచ్చుటకు అతడు సంతోషించుచు కృతజ్ఞత కలిగియుండవలెను.

సంఘసభ్యులు ఈ రీతిగా ఈయవలెను. స్థానిక సంఘమునకు ఆర్థిక సహాయము ఈ విధముగానే లభించును. దేవుడు తన పని నిమిత్తము ధన సహాయమును అందించు విధానము వేరొకటి లేదు. సంఘసభ్యులు తమ ఇష్టపూర్వకముగా యిచ్చిన కానుకలపై సంఘము ఆధారపడియున్నది. ఒకడు సంఘసభ్యుడుకాగానే, సంఘము తన పనిని నిర్వర్తించునట్లు సంఘమునకు ఆర్థికముగా సహాయముచేయు బాధ్యతను స్వీకరించును.

సభ్యులు ఇచ్చిన తరువాత, ఆ సొమ్మును దేవుని సేవ నిమిత్తమై జ్ఞానయుక్తముగా వినియోగించు బాధ్యతను సంఘము కలిగియున్నది. ఆ సొమ్మును సంఘము ప్రాముఖ్యముగా సువార్తను బోధించుటకును, ఆపదలోయున్నవారికి సహాయము చేయుటకును వినియోగించవలెను. స్థానిక సంఘము తన యొద్దనున్న సొమ్ములో ఎక్కువభాగమును తన యొక్క భౌతికావుసరముల నిమిత్తము వినియోగించకుండా జాగ్రత్తపడవలెను.

సభ్యులందరు లేఖనములప్రకారము యిచ్చుట అత్యావసరమని బోధించుట జరుగవలెను. పుచ్చుకొనుటకంటె యిచ్చుట ధన్యము అని యేసు చెప్పెను (అపొ.కా. 20:35). మనము దేవుని

రాజ్యమును మొదట వెదుకవలెనని క్రీస్తు చెప్పెను (మత్తయి 6:33). అనగా మనము కానుకలనిచ్చునపుడు ఆయన రాజ్య మును మొదట గమనించవలెనని యర్థము. మాసిదోనియలోని క్రైస్తవులు తమ శక్తికొలదికంటె ఎక్కువ యిచ్చిరి గనుక వారు కొనియాడబడిరి. అన్నిటి కంటె ముందుగా వారు తమ్మును తాము దేవుని కర్పించుకొనిరి.

ఒక బీద విధవరాలు తనకు కలిగినదంతయు ఎట్లు యిచ్చెనో నీకు జ్ఞాపకమున్నదా ? అననీయ, సప్పీరాలు వారు యిచ్చుచున్న దానిని గూర్చి అబద్ధమాడగా ఎట్లు తమ ప్రాణములను కోల్పోయిరో జ్ఞాపకమున్నదా ? (అపొ.కా.5:1-11). ఒకడు దేవునికి ఇయ్యవలసినది ఇయ్యకపోతే అతడు దేవుని నుండి దొంగిలించినయట్లుగునని లేఖనములు బోధించుచున్నవి. దేవుడు కానుకలు యిచ్చుటలో తన ప్రజలతో యిదివరలో చేసినట్లు ఇప్పుడు కూడ చేసిన యెడల యేమగును ? మనలో ఎంతమంది జీవించగలము ?

నేటి సంఘము ఎక్కువపని చేయ వలెను. లోకమున కంతటికిని సువార్తను బోధించు బాధ్యత అది యెక్కువ కలిగియున్నది. ఆ పనిని జరిగించుటకు ఎక్కువ ధనము అవుసరమైయున్నది. గనుక సంఘము తన పనిని నిర్వర్తించు లాగున నీవు, నేను క్రైస్తవులవలె ఎక్కువ ఈయవలెను. మనందరము లేఖనముల ప్రకారము ఇచ్చినయెడల లోకమున కంతటికిని సువార్త బోధించుటకు కావలసినదానికంటె ఎక్కువ సొమ్ము సంఘములో యుండును.

- జె.పి. ఛోట్

---


**సత్యవాణి టి.వి. కార్యక్రమములను**

ప్రతి సోమ, మంగళవారాల్లో ఉదయం 6.00 గంటలకు **శుభవార్త** ఛానల్‌లో చూడండి.

ప్రతి శనివారం ఉదయం 6.30 గంటలకు **టి.వి.-5** ఛానల్‌లో చూడండి.

**సత్యసువార్తను వినండి ! విశ్వసించండి !!**

# మహా బబులోను పతనము

## (The Fall of the Great Babylon)

**పరిచయము :**

ప్రకటన 17వ అధ్యాయములో మహావేశ్య యొక్క పతన దర్శనమును యోహాను చూచాడు.

దేవుని ప్రజలను నాశనం చేయడానికి అపవాది మూడు అస్త్రములనుపయోగిస్తాడు. ఈ మూడు అస్త్రములు ప్రకటన గ్రంథములో అలంకారరీతిగా చెప్పబడ్డాయి. అవి సముద్రములోనుండి వచ్చు మృగము, భూమిలోనుండి వచ్చు మృగము మరియు మహా వేశ్యయైన బబులోను. క్రూరమృగము అని చెప్పబడిన సాతానుడు మృగము యొక్క ముద్రధరించుకొనునట్లు దేవుని ప్రజలను పలువిధములుగా శోధిస్తూనేయుంటాడు.

సాతానుడు హింస, మోసము - అబద్ధము, మోహము అను అస్త్రములనుపయోగించి దేవుని ప్రజలను నాశనమునకు ఈడ్చుకొనిపోవ యత్నించుచుయుంటాడు. హింస ద్వారా నీ శరీరాన్ని గాయపరచితే నీవు ప్రభువును దూషిస్తావేమో యని అతడు ప్రయత్నిస్తాడు. అక్కడ విఫలమైతే అతడు నిన్ను అబద్ధ బోధలు, సిద్ధాంతాల ద్వారా నాశనం చేయయత్నిస్తాడు. నీవు దేవుని వాక్యాన్ని శ్రద్ధగా చదువకపోతే నకిలీ క్రైస్తవ్యమే నిజక్రైస్తవ్యమనుకోవచ్చు. రోమన్ కేథలిక్కులు, మతశాఖలు ఈ కోవకు చెందుతాయి. మూడవదిగా అపవాది మోహసంబంధమైన దుర్బుద్ధిని పుట్టించి నిన్ను చెరుపుతాడు. నీ హృదయాన్ని లోకమువైపు త్రిప్పుతాడు, నాశనం చేస్తాడు.

**ఇప్పుడు 17వ అధ్యాయమును చదువుము.**

**ఎర్రని మృగము మీద కూర్చున్న స్త్రీ : ప్రక 17:1-6**

- ప్రకటన 12లో సూర్య చంద్ర నక్షత్రములను ధరించుకొనిన స్త్రీని గూర్చి చెప్పబడెను. ఆమె పరిశుద్ధపట్టణమని పిలువబడినది. (ప్రక 21:2). ఆమె అరణ్యములోనికి కొనిపోబడెను.

- ప్రక 17:18లో చెప్పబడిన వేశ్య మహాపట్టణం అని చెప్పబడినది.

- 17:1 లో ఆమెకు జరుగు తీర్పును గూర్చి చెప్పబడినది. తీర్పు అనగా శిక్ష విధించబడుట యని అర్థము.

- రోమా పట్టణము వేశ్యయని పిలువబడెను. ఆమె ఎన్నడు క్రీస్తుకు వివాహము చేయబడలేదు.

నీనెవ(నహూము 3:4), తూరు (యెష 23:16-17) యెరూషలేము పట్టణములు కూడ వేశ్యయని పిలువబడెను (యెషయా 1:21)

- ఆ వేశ్య సువర్ణపాత్రను చేత పట్టుకొనియుండెను (4వ). ఆ పాత్ర ఏహ్యమైన కార్యములతోను, వ్యభిచార సంబంధమైన అపవిత్ర కార్యములతోను నిండియుండెను. యిర్మియా 51:7 లో ఇట్టి వర్ణన ఇయ్యబడెను.

- 'దానినొసట దాని పేరు ఈలాగు వ్రాయబడెను - మర్మము, వేశ్యలకును, భూమిలోని ఏహ్యమైన వాటికిని తల్లియైన మహాబబులోను" (5వ)

- రోమా పట్టణంలోని వేశ్యలు తమ పేళ్లను తమ నొసటి మీద వ్రాయించు కొనేవారు.

- ఈ వేశ్య పరిశుద్ధుల రక్తము చేతను యేసు యొక్క హతసాక్షుల రక్తము చేతను మత్తిల్లియుండెను (6వ)

- క్రైస్తవ్యారంభములో మొదటి శతాబ్దములో అసంఖ్యాకమైన క్రైస్తవులు హింసింపబడి చంపబడిరి. హతసాక్షులైరి. అట్టివారిలో అంతిపయి ఒకడు (ప్రక 2:13)

- తాను చూచిన దానిని బట్టి యోహాను ఆశ్చర్యపడెను.

- యోహాను అరణ్యమునకు కొనిపోగా ఈ మహావేశ్యను అక్కడ చూచాడు. ప్రకటన12లో సంఘము అరణ్యమునకు కొనిపోబడెను. సంఘము ఎక్కడ ఉంటే, సాతానుడు అక్కడకు వెళ్తాడు. వాడు ఈ మహా వేశ్యనుపయోగించి సంఘాన్ని దుర్మార్గతకు నడిపించ యత్నిస్తాడు.

**ఆ మర్మము యిక లేదు (17:7-14)**

- యోహాను ఆశ్చర్యపడగా ఏడు తలలును పదికొమ్ములును గల క్రూర మృగమును గూర్చి నీకు తెలియజేసెద నని దూత యోహానుకు చెప్పెను (7వ)

- ఆ క్రూరమృగము అగాధ జలములలో నుండి పైకి వచ్చుటకు, నాశనమునకు పోవుటకు సిద్ధముగా యుండెను. 9వ అధ్యాయములో గొప్ప అగాధమును గూర్చి చెప్పబడెను. ఆ యుగాధాన్ని సాతానుడు ఆక్రమించుకొనియుండెను. అది దుర్మార్గతకు, సమస్త దుష్టత్వానికి ఆధారం.

- క్రూరమృగము యొక్కయు, దాని ముద్ర ధరించుకొనినవారియొక్కయు అంతము - నాశనమే.

- 13వ అధ్యాయములో ఏడు తలలు కలిగిన క్రూర మృగము అనేక

ప్రభుత్వాలకు సూచనగాయుండెను. దానికి మరణకరమైన గొప్ప దెబ్బ తగిలెను. దాని తలలలో ఒకటి గాయపరచ బడెను. అది తాళుకొని మరల లేచెను. ప్రజలు ఆశ్చర్యపడిరి.

- హింసించు ప్రభుత్వమొకటి నాశనమయ్యిందనుకొనేసరికి దానికంటే ఘోరమైన ప్రభుత్వములు వచ్చును. ప్రపంచ చరిత్ర అంతా అంతే. ఈ క్రూరమృగము అగాధమునుండి పైకి వచ్చుటకు నాశనమునకు పోవుటకు సిద్ధముగా యుండెను.

- భూ నివాసులలో ఆ మృగముండెనుగాని యిప్పుడు లేదు. అయితే ముందుకు వచ్చునన్న సంగతి తెలిసికొని ఆశ్చర్యపడుదురు (8వ)

**రోమా పట్టణము విస్తార జలముల మీద కూర్చునియుండెను.**

విస్తార జలముల మీద కూర్చుని యున్న వేశ్య ఒక పట్టణము (1వ)

- రోమా పట్టణము విస్తార జలముల మీద కూర్చునియుండెను.

- కూర్చుని యుండుట అనగా ఏలుట, పాలించుట యని అర్థము.

- ఆ వేశ్య కూర్చున్న చోట కనబడు జలములు ప్రజలను, జనసమూహములను, జనములను సూచించును (15వ)

- ఈ వేశ్య భూరాజులను వ్యభిచార మద్యములో మత్తిల్లజేసెను.

- రోమా పట్టణంలో వేశ్యలు తమ విటుకాండ్రకు మద్యము త్రాగించి మత్తిల్లజేసేవారు.

- రోమా పట్టణము రాజకీయ, ఆర్థిక, మత వ్యవహారాల్లో ఆనాడు గొప్ప ప్రభావము కలిగియుండెను. అందువలన మిగతా దేశములు రోమా ప్రభుత్వ పలుకుబడికి లోనైయుండేవి.

- దానికి లోనైన వారిపేర్లు గొర్రెపిల్ల జీవ గ్రంథములో ఉండవు (17:8).

- యోహాను అరణ్యమునకు కొనిపోబడెను (3వ). ఆత్మీయ పోరాటము జరిగే స్థలము అరణ్యము. బాప్తిస్మమిచ్చు యోహాను అరణ్యములో ప్రకటించుచుండెను (మత్తయి 3). యేసుక్రీస్తు అరణ్యములో శోధింపబడెను (మత్తయి 4). అపోస్తలుడైన యోహాను పద్మాసులో పరవాసియైయుండెను (ప్రక 1:10). దేవుని ప్రజలు అరణ్యములో యున్నట్లు ప్రకటన 12లో మనం చూచాము.

- ఇప్పుడు యోహాను ఏడు తలలును పది కొమ్ములును గల ఎర్రని మృగము మీద కూర్చునియున్న ఒక స్త్రీని చూచాడు.

- ఆ మృగము రోమా ప్రభుత్వము. దాని మీద కూర్చున్నది రోమా పట్టణము. అది రాజరిక ధన సంపదలతో అలంకరింపబడియుండెను.

- దేవ దూషణ నామములతో రోమా ప్రభుత్వము నిండియుండెను. రోమా చక్రవర్తులు తామే దేవుడని ప్రకటించు కొనేవారు. ప్రజలు రోమా చక్రవర్తులను దేవునిగా ఆరాధించాలని శాసించేవారు. యిది దేవదూషణ.

- ఆ ఏడుతలలు స్త్రీ (రోమ్) కూర్చునియున్న యేడుకొండలు (9వ). రోమా పట్టణము ఏడు కొండలపై నిలిచియున్నది.

- మరియు ఏడుగురు రాజులు కలరు. అయిదుగురు కూలిపోయిరి. ఒకడున్నాడు. కడమవాడు ఇంకను రాలేదు.

- మొదటిగా ఏడుగురిలోను ఐదుగురు కూలిపోయిరి. ఒకడున్నాడు. ఈ దృశ్యం అంతా దానియేలు 2 మరియు 7వ అధ్యాయములలో యున్నది.

- ఏడుగురు రాజులు ఏడు రాజ్యము లను సూచించుచున్నది. గతంలో 5 సామ్రాజ్యములుండెను. అవి గ్రీకు, ఐగుప్తు, అష్షూరు, బబులోను, పర్షా రాజ్యములు. ప్రస్తుతముండినది రోమా సామ్రాజ్యము. ఇంకొకటి రావలసి యున్నది. గాని ఇంకా రాలేదు అని తెలియజేయబడెను.

- కొంతమంది విద్యావేత్తలు ఆ ఏడుగురు రాజులు, లేక ఎనిమిది మంది రాజులు రోమా చక్రవర్తులేయని తలస్తారు.

- ఆ ఏడుగురు అగస్టస్, కాలిగుల, క్లాడియస్, నీరో, వెస్పేసియన్, టైటస్ మరియు డొమేషియన్ అనువారు.

- రావలసిన ఎనిమిదవవాడు క్రైస్తవు లను తదుపరి హింసించిన భూప్రభుత్వ ములు మొదలైనవి.

- నీవు చూచిన పదికొమ్ములు పదిమందిరాజులు (12 వ). వీరు రోమా సామ్రాజ్యమునుండి అధికారము పొందినవారు. వారు రోమ్‌కు లోబడి దాని వలన వాడుకోబడిన రాజులు. వారు రోమాతో కలిసి క్రైస్తవులను హింసించిన వారు.

- తమ బలాన్ని అధికారాన్ని రోమ్‌కు అప్పగించి దాని చేతిలో కీలు బొమ్మలవలె వాడబడుదురు.

**గొర్రెపిల్లతో యుద్ధము (14 - 15)**

- పై రాజులు / ప్రభుత్వములు గొర్రెపిల్లతో యుద్ధము చేతురు గాని ఆయన ఆ రాజులను జయించును.

- గొర్రెపిల్ల వారిని జయించును ! ప్రకటన 19లో ఆ విజయం మరింత విపులీకరించబడినది.

- గొర్రెపిల్ల ప్రభువులకు ప్రభువు, రాజులకు రాజు. ఆయన ప్రభువులలో ప్రభువుకాదు, గాని ప్రభులకు ప్రభువు. ఆయన అత్యున్నతుడు. అన్నిటిలో ఆయనకే ఆధిక్యత (కొలస్స 1:18).

ఆయన రాజులలో రాజు కాదు, గాని రాజులకు రాజు. ఆయన సకల యుగము లలో రాజైయున్నాడు. (1 తిమో 1:17)

- తనతోయున్నవారు పిలువబడిన వారై, యేర్పరచబడినవారై, నమ్మకమైన వారైనందున ఆయన ఆ రాజులను జయించును.

- ఆయనతో యున్నవారు క్రైస్తవులు.

- వారు పిలువబడినవారు : క్రైస్తవులు సువార్త వలన పిలువబడినవారు (2 థెస్స 2:14). సంఘమనగా పిలువబడిన వారని యర్థము.

- వారు ఏర్పరచబడినవారు : జగత్తు పునాది వేయబడక మునుపే దేవుడు క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను. (ఎఫెసీ 1:4; 2 పేతురు 1:10)

- వారు నమ్మకమైన వారు : క్రైస్తవులు మరణ పర్యంతము నమ్మకముగా యుండాలి (ప్రక 2:10; 1 కొరింథీ 4:2)

**16-18 వచనములు :**

- రోమాతో ఏకీభవించిన వారు కొంతకాలానికి దానిమీద తిరుగుబాటు చేసి, దానిని ద్వేషింతురు.

- దేవుని మాటలు నెరవేరు వరకు ఈ లోక రాజ్యములను దేవుడు వినియోగించును. సర్వోన్నతుడైన దేవుడు మానవుల రాజ్యముపైన అధికారియై యున్నాడు. తానెవనికి దానిననుగ్రహింప నిశ్చయించునో వానికి ఆయన అనుగ్రహించును (దానియే 4:24).

- న్యాయాధిపతులు 7:22 లో ప్రతివాని ఖడ్గము తన పొరుగువాని మీదికి త్రిప్పబడుట చూడగలము.

- మరియు నీవు చూచిన ఆ స్త్రీ భూరాజుల నేలు మహా పట్టణమే (18వ). ఆది రోమా పట్టణము.

**ముగింపు :** ప్రకటన 17వ అధ్యాయ వర్తమానం యిది : సాతానుశక్తులు గొర్రెపిల్లతో పోరాడుదురు. గొర్రెపిల్ల వారిని జయించును. ఆయన రాజులకు రాజు. ప్రభువులకు ప్రభువు. ఆయనతో కూడ యున్న వారు కూడ జయింతురు. ఆయనకు నమ్మకముగా యుంటే దేనిని గూర్చి చింతపడవసరంలేదు.

# కవులు - ప్రవక్తలు

ఇంతవరకు పాతనిబంధనలోని చరిత్ర భాగమును మనము చదివి యున్నాము. ఇంకా 22 పుస్తకములు మిగిలియున్నవి. అవి పద్యభాగము, ప్రవచన భాగములై యున్నవి. వాటిని గురించి ఈ పాఠములో మనము చదువుకొందుము.

**పద్యగ్రంధములు**

హెబ్రీ సాహిత్యములో పూర్వపు యతి ప్రసాలుండెడివి కావు కాని పద్య పాదములు లయబద్ధముగా ఉండెడివి. ముందు చెప్పబడిన భావమును తరువాతి పాదములలో వేరొక మాటలలో మరల నొక్కి చెప్పెడివారు. పాతనిబంధన యందు 5 పద్యకావ్యములు కలవు. అవి యోబు, కీర్తనలు, సామెతలు, ప్రసంగి మరియు పరమ గీతములు. ఆఖరి మూడు పుస్తకములను సొలోమోను మహారాజు రచించాడు. కీర్తనల గ్రంధములోని 150 కీర్తనలలోను 73 కీర్తనలు దావీదు మహారాజుచే వ్రాయ బడినవి. మిగిలిన కీర్తనలలో గ్రంధకర్త తెలియని కీర్తనలను చాలావరకు దావీదే వ్రాసెను. యోబు గ్రంధకర్త ఎవరో తెలియదు. యోబు గ్రంధము యోబు అనెడి పరిశుద్ధుని జీవిత చరిత్ర. ఈయన పిల్లలను, ఆస్థిని, ఆరోగ్యమును పూర్తిగా కోల్పోయినను దేవుని ఎడల విశ్వాసిగా ఉండెను. ఈ పుస్తకములోని చాలా భాగము ఉత్తర ప్రత్యుత్తర రీతిలో వ్రాయబడి యోబునకు, ఆయన స్నేహితులకు మద్య జరిగిన వాదోప వాదనలను మనము చూడగలము. ఆయన స్నేహితులు తమ వాదన ద్వారా యోబు పాపము చేసి దాని ప్రతిఫలము ఇప్పుడు అనుభవించుచున్నాడని నిరూపించుటకు ప్రయత్నము చేసిరి. కాని యోబు తాను నిరపరాధినని వాదించెను. యెహోవా దేవుడు ఆయన విశ్వాసము నకు ప్రతిఫలముగా అతడు శ్రమపడక మునుపు ఉన్న స్థితికన్న అత్యధికముగా ఆశీర్వాదములు అనుగ్రహించెను.

బైబిలంతటిలో అందరికీ ప్రీతికర మైన పుస్తకము కీర్తనల గ్రంథము. కీర్తనలు అనగా కీర్తించు స్తుతి పాటలు. ఇందులో కొన్ని కీర్తనలు ప్రస్తుతము రాగములు కల్పింపబడి క్రైస్తవులచే ఆరాధనలయందు పాడబడుచున్నవి. ఈ గ్రంధములు 5 భాగములుగా మొదట విభజించబడినవి. బైబిలులో అన్నిటికన్నా

చిన్న అధ్యాయు మధ్యనున్న అధ్యాయము 117వ దావీదు కీర్తన. అన్నిటికన్న పెద్దది 119వ దావీదు కీర్తన. దీనియందు 176 వచనములు గలవు.

పరమగీతములు సోలోమోనుచే వ్రాయ బడినవి. ఆయన యౌవన కాలమందు దానిని రచించెను. సామెతలను నడివయస్సు నందు రచించెను. ప్రసంగి వృద్ధాప్యమునందు వ్రాసెను. సామెతెలు జ్ఞానముతో కూడిన వచనములు. అందులో చాలా సామితెలు మనకు సుపరిచితములు. ప్రసంగి సమస్తమును వ్యర్థమని చెప్పిన గ్రంధము. సోలోమోను ఆనందమును పొందుటకు చేసిన ప్రతి పని యందు విఫలుడైన తర్వాత సమస్తమును వ్యర్ధమని కనుగొని ఈ గ్రంధము వ్రాసెను. ఆయన ఆ గ్రంధమును సమస్తమును వ్యర్థము వ్యర్థమనే మాటలతో మొదలుపెట్టెను. (ప్రసంగి 1:2) ఇదంతయు వినిన తర్వాత తేలిన ఫలితార్థమిదే; దేవునియందు భయభక్తులు కలిగియుండి ఆయన కట్టడలననుసరించి నడుచుచుండవలెను. మానవకోటికి ఇదే విధి (ప్రసంగి 12:13) ఈ వచనముతో తన గ్రంధమును ముగించెను.

ప్రవచన గ్రంధాలు 17 వీటిని రెండు భాగాలుగా విభజించారు. పెద్దవి 5, చిన్నవి 12 వాటి నిడివిని బట్టి పెద్దా చిన్నలుగా వేరుచేయబడ్డాయి. ఈ17 గ్రంథాలు విలాపవాక్యాలు తప్ప మిగిలినవి వాటి గ్రంధర్తల పేర్లతోనే పిలువబడుచున్నాయి. విలాపవాక్యాలు యిర్మీయా ప్రవక్తచే వ్రాయబడ్డాయి.

ప్రవక్తలు దేవుని సందేశాలను మానవులను అందించే వార్తా వాహకులు (హరులు). వీరిలో చాలామంది ఇశ్రాయేలు విగ్రహారాధన వైపు మళ్ళుతున్న క్లిష్టసమయాలలో జీవించారు వీరిలో కొంతమంది యాజకులు నుండి వచ్చినవారు మరి కొంతమంది రాజ వంశము నుండి జన్మించినవారు. వారు దైవావేశముతోదేవుని సందేశాన్ని అలంకార రూపకములతో ప్రజల కందించారు. ప్రవక్తలందరూ గ్రంథాలను వ్రాయలేదు. అతిముఖ్యమైన వక్తలైన ఏలియయా ఎలీషాలు ఏ గ్రంథాలూ వ్రాయలేదు.

ప్రవక్తలు ఇశ్రాయేలు యొక్క (మనస్సాక్షి) లేక అంతరాత్మ వారి కర్తవ్యము ఇశ్రాయేలును విగ్రహారాధన నుండి మళ్ళించి దేవుని తట్టు త్రిప్పుట. లేనియడల వారు నాశనమగుదురని ప్రబోధించిరి. కానీ ఇశ్రాయేలులో శేషించిన వారినుండి యెహోవా తట్టు ప్రపంచాన్ని త్రిప్పే ప్రభావం బయలు దేరుతుందనే ఆశాకిరణ మాత్రం వాగ్దానం చేయబడింది. దీనినే వారు

చిగురుకొమ్మ అని లోకరక్షకుడైన క్రీస్తు దావీదు వంశము నుండి జన్మిస్తాడని ప్రవచించారు.

ఈ ప్రవచన గ్రంధాలయందు చరిత్ర కొంత వ్రాయబడింది, కొద్దిగా గద్దింపు హెచ్చరికలు వ్రాయబడ్డాయి. వాటియందు భవిష్యత్తులో జరుగబోవు సంగతులను గూడా వ్రాశారు. గొప్ప పట్టణాలైన నీనివే, బబులోనుల నాశనాన్ని గూర్చి కూడా ప్రకటించబడింది. కానీ వీటిలో ఎక్కువగా లోకరక్షకుడైన మెస్సయ్యా అను క్రీస్తు యొక్క రాకడ గూర్చి ఆయన వచ్చి స్థాపించబోవు రాజ్యమును గూర్చి ప్రవచించబడింది. ఈ ప్రవచనాలు నెరవేర్చబడటంవల్ల, మనకు దేవునియందు విశ్వాసం బలపడుతుంది. క్రీస్తు మన రక్షకుడనే విశ్వాసం పెరుగుతుంది. ఈ ప్రవచనముల నెరవేర్పువల్ల బైబిలు దైవావేశం వల్ల కలిగిన దేవుని వాక్యమని నమ్మగలుగుచున్నామని ఋజువు కాబడుచున్నవి.

**ప్రవచన గ్రంధాలు - పెద్దవి**

ఈ గ్రంధాలలో ముఖ్యమైనది అతి పెద్దదైనది "యెషయా" గ్రంధము. ఈ గ్రంధకర్తయైన యెషయా తన గ్రంధమందు "మెస్సయ్యా" రాకడ గూర్చి ఎక్కువగా వ్రాసినందున ఈయన "మెస్సయ్యను గూర్చి ప్రవచించిన ప్రవక్త"యని పేరు పొందెను.

మెస్సయ్యా దావీదు సంతానము నుండి వచ్చునని ఖచ్చితముగా ఈయన ప్రవచించెను. బైబిలునందు క్రీస్తును గూర్చి అతి ఖచ్చితముగాను చక్కగాను ప్రవచించబడినది.

యిర్మియా - ఈయన విలపించు ప్రవక్తయని పేరు. ఈయన "విలాప వాక్యాలను" గ్రంధాన్ని కూడా వ్రాశాడు. యూదా మారు మనస్సు పొందాలని లేనియెడల నాశనం తప్పదని ఈయన ప్రవచించాడు. ఈయన బ్రహ్మచారి. నిర్భయముగా ప్రవచించేవాడు తద్వారా చాలా సార్లు జైలు పెట్టబడ్డాడు.

యెహెజ్కేలు, దానియేలు - వీరు బబులోను చెరలోనున్నప్పటివారు. యెహెజ్కేలు గ్రంధం చాలా లోతైన మర్మాలు కలది. ఇందు అలంకార రూపకంగా చాలా సంగతులు వ్రాయబడ్డాయి. దీన్ని అర్థం చేసుకోవడం కొంచెం కష్టం. దానియేలు తన గ్రంధమునందు చరిత్రను వ్రాసాడు. బబులో పారసీక మహాసామ్రాజ్యాల పతనము భవిష్యత్తును గూర్చి ప్రవచించాడు. ఈయన క్రీస్తు రాజ్యస్థాపనము గూర్చి చాలా స్పష్టముగా ప్రవచించాడు. దానియేలు 2:44 నందు "ఆ రాజుల కాలములలో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యము

స్థాపించును దానికెన్నటికిని నాశనము కలుగదు. ఆ రాజ్యము దానిని పొందిన వారికి గాక మరియెవరికిని చెందదు. అది ముందు చెప్పిన రాజ్యములన్నిటిని పగులగొట్టి నిర్మూలము చేయును. గాని అది యుగముల వరకు నిలుచును.

ప్రవక్తల గ్రంథములు - చిన్నవి

యోవేలు : ఈయన మనకు గ్రంథ రూకముగా చిన్న పుస్తకమును వ్రాసి యిచ్చెను. దేవుని ప్రజలైన యూదా వారు మారుమనస్సు పొందవలెనని ప్రవచనము ద్వారా పిలుపునిచ్చెను.

యోనా : అది దుర్మార్గమైన నినీవె పట్టణస్తులును మారుమనస్సు పొందవలసినదిగా ప్రవచించెను. వారు అలాగు మారుమనస్సు పొందిరి గాని 150 సం॥ తరువాత నహూము అను ప్రవక్త ద్వారా ప్రభువు మరలా నీనివేవారు మారుమనస్సు పొందవలసినదిగా ప్రకటింపచేసెను. అయినను వారు మారు మనస్సు పొందనొల్లందున ప్రభువా పట్టణమును నాశనము చేసెను.

ఓబద్యా : మృత సముద్రమునకు ఆగ్నేయదిశలో నున్న యూదా దేశపు పొరుగు రాజ్యమైన ఎదోమును గూర్చి ప్రవచించబడెను. ఈ ప్రవచనము ఆ రాజ్యము సమూల నాశనమగుట ద్వారా నెరవేర్చబడెను.

అమోసు, యెషయా : వీరు సమకాలికులు ఇశ్రాయేలును గూర్చి ప్రవచించిరి. అమోసు పశువుల కాపరి ఇతను. ఇశ్రాయేలుగా మాత్రమేగాక యూదాను గూర్చియు ఇతర రాజ్యములను గూర్చియు ప్రవచించెను. తన స్వంత జీవితములో తన భార్య వ్యభిచరించి తనకు అవిశ్వాసిగా ఏలాగు ద్రోహము చేసెనో ఆమాదిరిని చూపి ఇశ్రాయేలు విగ్రహ అరాధన అను ఆత్మీయ వ్యభిచారము చేయుట ద్వారా దేవునికి వ్యతిరేకముగా పాపము చేసిరని ప్రత్యక్షముగా చూసెను.

జెఫన్యా, మీకా : వీరు యూదాను గూర్చి ప్రవచించవలసినదిగా దేవునిచే ఆజ్ఞాపింపబడిరి. దేవుని ప్రజలు పాపము నుండి మారు మనస్సు పొంది దేవుని తట్టు తిరగవలెనని ప్రవచించిరి. ఆలాగు దేవుని ప్రజలు మారు మనస్సు పొందుదురని ఎదురుచూచిరి. జెఫన్యా తన గ్రంథమందు చెరకు కొనిపోబడిన దేవుని ప్రజలు శేషించిన వారు రక్షించ బడుదురని ప్రవచించెను. మీకా తన గ్రంథమందు మెస్సయ్య బేత్లహేము గ్రామము నందు జన్మించునని ప్రవచించెను.

హబక్కూకు : బబులోను అణచి వేతలో యూదా రాజ్యమున్నప్పుడు ఈయన ప్రవచించెను. దేవుని యొక్క

తీర్పు త్వరలో సంభవించునని ఈయన చెప్పెను. ఆయన తన గ్రంధమందు మూలాంశముగా నీతిమంతుడు విశ్వాసము లుగా జీవించునని 2:4 నందు వ్రాసెను.

హగ్గయి, జకర్యా : యూదులు బబులోను చెరనుండి తిరిగి వచ్చిన తరువాత యెరూషలేములో దేవాలయము కట్టవలెనని వారిని పురికొల్పిరి. జకర్యా. ఇది కేవలము మెస్సయను గూర్చి ప్రవచించిన గ్రంధము ముఖ్యముగా క్రీస్తు వారు ముప్పది వెండి నాణెములకు అమ్మబడుదురని ఈయన ప్రవచించెను.

మలాకి : ఈ గ్రంధము తరువాత పాత నిబంధన యందలి ప్రవచనములు నిలిచిపోయెను. యూదులు తమ వ్యర్ధమైన ఆరాధననుమానవలెనని ఈయన ప్రవచించెను. ప్రభువునకు ముందు మార్గమును సరాళము చేయు ఏలియాను దేవుడు ముందుగా పంపించునని ప్రవచించెను ఇది బాప్తిస్మము ఇచ్చు యోహాను క్రీస్తు ముందు వచ్చును అను ప్రవచనమే.

# దేవుని ప్రత్యేక ప్రజలు

## *(God's Special People)*

యుక్తవయస్సు వచ్చినవాడు ఆత్మీయంగా తిరిగి జన్మిస్తే (యోహాను 3:3-5), అతడు దేవునితో సంబంధము కలిగియున్న ప్రత్యేక వ్యక్తి అవుతాడు (1 పేతురు 2:9-11). అతడు / ఆమె దేవుని ఆత్మీయబిడ్డ యగును. నిత్యజీవమునకు వారసులగును (గలతీ 3:26-29).

మానవులందరు పాపము చేసే సహజ గుణమును కలిగియున్నందున, పాపమును జయించి జీవించు విధానమును దేవుడు వారి కొరకు సంకల్పించాడు. తిరిగి జన్మించిన తరువాత కూడ మానవుని స్థితి దిగువ లేఖనాల్లో వర్ణించబడినది. రోమా 7:14-25, 8:1; గలతీ 5:16-18, 22-25, రోమా 8:5, 6, 14). మానవులందరు పాపమునకు లోనయ్యేవారే (రోమా 3:23; ఎఫెసీ 2:1-3).

మనం పరిశుద్ధాత్మని ఉపదేశమును బట్టి క్రొత్త నిబంధనను బట్టి నడుచుకొంటే పాపముపై విజయాన్ని తప్పక సాధించగలము (1 యోహాను 5:4;2 పేతురు 1:3,4).

దేవుని ఆత్మీయ బిడ్డ ఎల్లవేళలా

దేవుని కృపలోను దయలోను నిలుచును (1 పేతురు 2:9-10). అతని విశ్వాసము వలన దేవుని కరుణా పీఠమును సమీపించగలదు. అందువలన దేవునికి, ఆయనకు విధేయులైన వారికి మధ్య సమాధానముండును (రోమా 5:1-5).

మారుమనస్సు పొందిన ఈ విశ్వాసికి రక్షణ అనుగ్రహించబడెను (తీతు 2:11-14). అందువలన అతడు భక్తి హీనతను ఇహలోక సంబంధమైన దురాశలను విసర్జించి శుభప్రదమైన నిరీక్షణ నిమిత్తము ఈ లోకములో స్వస్థ బుద్ధితోను నీతితోను బ్రతుకుచుండ వలెనని దేవుని వాక్యము అతనికి బోధించుచున్నది. అట్టివాడు సత్క్రియలు చేయుట యందు ఆసక్తిగలవాడై యుండాలి (ఎఫెసీ 2:8-10).

దేవుని ఆత్మీయ బిడ్డ ఆయన కృపా సింహాసనము నొద్దకు చేరుటకు అవకాశము గలవాడు (1 తిమో 2:5; హెబ్రీ 4:14-16). ఈ తరుణం మరెవనికీ లేదు. యేసుచే స్వస్థపరచబడిన వాడొకడు "దేవుడు పాపులమనవి ఆలకింపడని యెరుగుదుము. ఎవడైనను దేవభక్తుడై యుండి ఆయన చిత్తము చొప్పున జరిగించిన యెడల ఆయన వాని మనవి ఆలకించును" అని చెప్పెను (యోహాను 9:31), కొర్నేలీయే దీనికొక ఉదాహరణమై యున్నాడు. (అపొ.కా. 10:1-4). 1 యోహాను 5:14-15 కూడ చదువుము.

ఆత్మీయావసరముల విషయమైతే దేవుని బిడ్డ ఆందోళన చెందనవసరం లేదు. ఏలయనగా దేవుడు వాటి విషయమై షరతులతో కూడిన వాగ్దానము చేసారు (మత్త 6:22; హెబ్రీ 13:5, 6).

దేవుని బిడ్డయైనవాడు పాపము చేస్తే అతడు దానిని గూర్చి మారు మనస్సు పొంది, దాన్ని ఒప్పుకొని క్షమాపణ కొరకు ప్రార్థించవలెను. అట్టివానికి క్షమాపణను దేవుడు వాగ్దానము చేసారు (అపొ.కా. 8:22; 1 యోహా 1:7-9; యాకోబు 15:16-20).

క్రైస్తవులు ఆత్మీయ సహోదరులను ప్రేమించాలి (1 పేతురు 2:17; 2 పేతురు 1:7-8). క్రైస్తవులు అందరికీ మేలు చేయాలి. ముఖ్యముగా విశ్వాస గృహమునకు చెందిన వారికి మేలు చేయాలి (గలతీ 6:10).

నీవు దేవుని ప్రత్యేక ప్రజలలో ఒకడవా ? నీవాయనకు ప్రత్యేకంగా యుండాలని ఆయన కోరుచున్నారు (1 తిమో 2:1-6).

- డాన్ నార్వుడ్

# సంక్షిప్త వార్తలు

2008 మే 5వ తేదీ సోమవారం కాకినాడకు సమీపముగాయున్న పటవల గ్రామములో జరిగిన సువార్త కూటములో రిక్కీ గూటంగారు వాక్యపరిచర్య చేసిరి. పటవలలో వి. సుదర్శన్‌గారు సువార్త పని చేయుచున్నారు.

మే నెల 9వ తేదీ శుక్రవారం శంఖవరంలో జరిగిన సువార్త కూటములో ఉదయం చంద్రశేఖర్‌గారు, సాయంత్రం రిక్కీగూటంగారు వాక్యపరిచర్య చేసిరి. శంఖవరంలో బి.డి.ఎస్. రవికుమార్‌గారు సువార్త చాటుచున్నారు.

మే నెల 18వ తేదీ సాయంత్రం కోరుకొండలో క్రీస్తు సంఘములు ఐక్యసువార్త ఘన కూడిక జరిగెను. కీ॥శే॥ కె. కొర్నేలియస్‌గారు ఆ ప్రాంతములో సువార్త పని ప్రారంభించి 50 సంవత్సరములు పూర్తి అయిన సందర్భములో ఆయన కృషి ద్వారా నెలకొల్పబడిన క్రీస్తు సంఘములు కూడి రాగా సభ ఘనంగా జరిగెను. అందు సోదరులు వి. సుదర్శనరావుగారు(రాజమండ్రి), రాజా విజయ్‌కుమార్‌గారు, రిక్కీగూటంగారు, జాషువా గూటంగారు వాక్యపరిచర్య చేసిరి. సోదరులు పి.వి. రత్నంగారు అధ్యక్షత వహించి సభను ఘనంగా నిర్వహించిరి. కొర్నేలియస్ గారి కుమార్లు అబ్రాహాం, సాల్మన్‌రాజు, మోజెస్‌బాబుగార్లు విస్తృత ఏర్పాట్లు చేసి, హాజరైన ముఖ్యఅతిధులను సత్కరించి, వికలాంగులకు, బీదలకు వాహనములు వస్త్రములు దానము చేసి దేవుని మహిమపరచిరి. హాజరైన వందలాది ప్రజలు, సంఘసభ్యులు ప్రభువును స్తుతించిరి.

మే నెల 20 వ తేదీ మంగళవారం దేవగుప్తములో సువార్తికుల సదస్సు ఘనముగా జరిగెను. ఉభయగోదావరి, విశాఖ, కృష్ణా జిల్లాల నుండి అనేకమంది సువార్తికులు హాజరై "క్రొత్త జన్మ" అనగానేమి అనే అంశమును ధ్యానించిరి. సోదరులు రిక్కీ గూటంగారు అధ్యక్షత వహించి సదస్సును చక్కగా నడిపించిరి. గంభీర ఉపన్యాసం చేసిరి. సోదరులు వి.జె. ఫ్రాన్సిస్, యన్. మోజెస్, సిహెచ్. జాన్‌బాబు, ఎస్. యేసురత్నం, యి. ప్రభాకరరావు, వి. జిమ్ ప్రకాష్ గార్లు పై అంశముపై చక్కటి విశ్లేషణ అనుగ్రహించిరి. దేవగుప్తంలోను, పరిసర గ్రామములలోను సోదరులు ఎన్. ఏలియా, ఎన్.జె. రాజుగార్లు నిర్విరామకృషి

చేస్తూ బలమైన సువార్త పనిచేయుచున్నారు. జూన్ నెల సదస్సు వాడపల్రులో జరుగును.

మే 28వ తేదీ ఉండేశ్వరపురంలో జరిగిన సువార్త కూటములో వి. జిమ్ ప్రకాష్, రిక్కీ గూటం గార్లు చక్కటి వాక్య పరిచర్య చేసిరి. 29వ తేదీనాడు రాజమండ్రి సారంగధరమెట్ట స్థానిక సంఘములో యూత్ మీటింగ్ వి. రాజా విజయ్‌కుమార్ గారి ఆధ్వర్యమున ఘనముగా నిర్వహించబడెను. అదేరోజు సాయంత్రం వీధి వారి లంకలో జరుగుచున్న సువార్త కూటములో రిక్కీ గారు వాక్యపరిచర్య చేసిరి. దానికి ముందు రోజు అక్కడ ఎన్. ఏలియాగారు వాక్యపరిచర్య చేసిరి. వీధి వీరి లంకలో సోదరులు కోనాల డేవిడ్ రాజుగారు క్రీస్తు కొరకు మంచి పని చేయుచున్నారు.

మే 31వ తేదీ శనివారం పాసర్లపూడిలో సోదరు కె. ఐజక్ గారి ద్వారా నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయమును రిక్కీ గూటంగారు రిబ్బను కత్తిరించి ప్రతిష్ట చేసిరి. అక్కడ జోసఫ్‌గారు సువార్త చాటుచున్నారు.

RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2006-2008

To

From:

SATYA VAKKU
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004